ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 14 నవంబరు 2025 | 5

ఆలయ నిర్మాణాలకు ప్రతిపాదనలు స్వీకరణ



నిడదవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఈ మేరకు గురువారం నిడదవోలులో ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ శ్రీవాణి భజన మండపం పథకం కింద ఏపీలో 500 దేవాలయాల అభివృద్ధికి ముందుకొచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి ఐదు సెంట్లు స్థలం ఉంటే రూ.10 లక్షలు, 8 సెంట్లు స్థలం ఉంటే రూ.15 లక్షలు, 10 సెంట్లు కన్నా ఎక్కువ ఉంటేరూ. 20 లక్షలు మంజూరవుతాయన్నారు.ప్రతిపాదనలు పంపేవారు ఖాళీ స్థలం ఫొటోలు, ఆలయ ప్లాన్, జీపీఎస్ ఫొటోలను జత చేయాలన్నారు.

ఆకట్టుకున్నారు.. అలరించారు..



రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి వారసత్వాన్ని యువతకు పరిచేయడమే గిరిజన స్వాభిమాన్ ఉత్స వాల ప్రధాన ఉద్దేశమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎస్.జ్యోతి అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయం తిని పురస్కరించుకుని బొమ్మూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం సం ప్రదాయ గిరిజన వస్త్రధారణ ఫ్యాషన్ షో జరిగింది.పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు.శనివారం ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని బహుమతులు అందజేస్తారు.

జైకొడతాం.. గణేశా!



బిక్కవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయాన్ని రూ.16 కోట్లతో అభివృద్ధికి దేవదాయశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఆలయం బాగా పురాతనమైనది కావడం, భక్తుల రద్దీ పెరగడంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేవదాయశాఖ ఆలయాన్ని పరిశీలించి ఆలయ అభివృద్ధికి స్థలం సేకరిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ఈ మేరకు గ్రామస్తులు దాతల సహకారంతో ఇప్పటికే రూ.కోటి విలువ చేసే భూములను దేవదాయశాఖకు అప్పగించారు. ఇంకో రూ.1.5 కోట్ల భూములను సేకరించే పనిలో ఉన్నారు. దీంతో దేవదాయశాఖ డీఈఈ ఉదయ్‌కుమార్ సేకరించిన స్థలాన్ని, ఆలయాన్ని పరిశీలించిన అనంతరం రూ. 16 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. నిధులు విడుదలకు కృషి చేస్తామన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని వినతి

కొవ్వూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని లేఅవుట్ - 3లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5 ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. రాజమహేంద్రవరంలో గురువారం జిల్లా కలెక్టర్ కీర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొవ్వూరులోని నందమూరు జంక్షన్ వద్ద పశివేదల రోడ్‌లో ఇంటి స్థలాలు అందించడానికి 11.68 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో సేకరించారు. అయితే చాలా మంది లబ్ధిదారులు ఆ స్థలాలు పొందడానికి ఇష్టపడడం లేదు. ఖాళీగా ఉన్న లేఅవుట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 5 ఎకరాలు, బీసీ సంక్షేమ సంస్థ నిర్మాణానికి 5 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందజేశారు. వాడపల్లి బంగారంపేట వద్ద వాటర్‌గ్రిడ్ కోసం రైతుల నుంచి భూసేకరణచేస్తున్న పొలాలకు గిట్టుబాటు ధర అందించాలని రాత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.



ఇసుకాసురులు!

గోదాట్లో ఇసుక మాఫియా

- రెచ్చిపోతోన్న అక్రమార్కులు
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- నిబంధనలు మీరి తవ్వకాలు
- అన్ని ర్యాంపుల్లోనూ డ్రెడ్జింగ్
- అయినా పట్టని అధికారులు
- అటకెక్కిన ఉచిత ఇసుక

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నారు. పేరుకే బోట్స్‌మన్ సొసైటీలు. గోదారి నిండా డ్రెడ్జింగ్ బోట్లే. ఇష్టానుసారం ఇసుకను తవ్వేస్తున్నారు. అనేక మంది దోపిడీకి పాల్పడుతున్నారు. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ రూ.లక్షలు దోచుకుంటున్నారు.అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కంటే ప్రజలకు కాస్త తక్కువ ధరకు ఇసుక లభ్యం కావడం గమనార్హం. కానీ ఇసుక దోపిడీ లేకపోతే వినియోగదారుడికి మరింత చౌకగా ఇసుక లభ్యమయ్యేది.

డ్రెడ్జింగ్ చేసినా పట్టదెందుకో..

పడవలపై ఇసుక తీస్తే కాస్త ఎక్కువ ధర ఉంటుంది. కానీ డ్రెడ్జింగ్ వల్ల చౌకగా ఇసుక లభ్యమవ్వాలి.కానీ డ్రెడ్జింగ్ చేసినందుకు యూనిట్‌కు రూ.200.. అది డ్రెడ్జింగ్ బోట్ నుంచి అన్‌లోడ్ చేసి గట్టు మీద వేసినందుకు రూ.100.. మిషన్‌తో దానిని లారీలో ఎగుమతి చేసినందుకు రూ.200..గట్టుమీద కూర్చుని ఈ వ్యవహారం అంతా నడిపించినందుకు బోట్స్‌మన్ రూపంలో ఉన్న వ్యాపారికి రూ.500.. ఇక నేతలకు టన్నుకు రూ.50 లేదా 3 యూనిట్ల లారీకి రూ.1000, 6 యూనిట్ల లారీకి రూ.2 వేలు ఇవాల్సిందే. అవి కాకుండా పెద్దల పేర్లు చెప్పుకు తిరిగే నేతలకు ఒక్కొక్కరికి రూ.100 వంద వంతున చెల్లించుకోవాలి. పోలీసులు, ఇతర అధికారులకు రూ.100 వంతున ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి బోట్స్‌మన్ సొసైటీల ద్వారా మాన్యువల్‌గా ఇసుక తీయడానికే డీసిల్టేషన్ పేరిట ర్యాంపులను ఇచ్చారు. కానీ అందరూ డ్రెడ్జింగ్ పడవలు వాడేస్తున్నారు. గతంలో మత్స్యకారులు, బోట్స్‌మన్ సొసైటీలు వాడిన ఇంజన్ పడవలు ఒడ్డున పడిఉన్నాయి. ప్రస్తుతం డ్రెడ్జింగ్ బోట్లు రాజ్యమేలుతున్నాయి.ర్యాంపులకు వెళితే కళ్లెదుట కనబడినా అధికారులు కళ్లు మూసుకుంటున్నారు.ఏదో అడపాదడపా తనిఖీలతో సరిపెడుతున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ ఇసు కాసురులకే సహకరిస్తున్నారు.

రాత్రయితే తవ్వేయ్..

వాస్తవానికి పగటి పూటే ఇసుక తీయాలి. కానీ సాయంత్రం ఆరు గంటలకు ఆరంభించి అర్థరాత్రి వరకూ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. 40 టన్నుల లారీల్లో 60 టన్నుల వరకూ ఇసుకను వేసి రాత్రికి రాత్రే తరలించేస్తున్నారు. ప్రధానంగా రాజమహేంద్రవరం నుంచి బొమ్మూరు మీదుగా ప్రతి రోజూ వందలాది లారీల ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే వారే కాన రావడంలేదు. దానికి తెల్లారి ఆ రోడ్లపై పడి ఉండే ఇసుకే సాక్ష్యం. మామూళ్లకు అలవాటు పడిన రాత్రి పోలీసులు బాలాజీపేట జంక్షన్‌లో కాపు కాసి లారీకి ఇంతని తీసుకుని వదిలేస్తున్నారు. ఇది చాలా కాలంగా జరుగుతున్న తంతే..ఆ సెంటర్‌లో ఏ సీసీ కెమెరాలో చూసినా ఈ భాగోతం బయటపడుతోంది.రాత్రుళ్లు ఎన్ని లారీలు వెళ్లిపోతున్నాయో తెలుస్తోంది. తరలిపోయిన ఇసుకే కాకుండా తెల్లారే సరికి గోదావరి ఒడ్డున పెద్దపెద్ద ఇసుక గుట్టలు ఉంటాయి. దానిని రాత్రీ పగలూ అమ్ముతూనే ఉంటారు.అంత ఇసుక ఎలా వచ్చిందని ఎవరూ అడిగే ధైర్యం చేయరు. ఎందుకంటే అందరికీ తెలిసిన రహస్యమే..అదే డ్రెడ్జింగ్.. బహిరంగంగా పెద్దపెద్ద డ్రెడ్జింగ్ పడవలే గోదా వరికి చేరినా ప్రశ్నించేవారే కరువయ్యారు.

బ్రిడ్జిల చెంత వదలరు..

ఫోర్త్ బ్రిడ్జి సమీపం నుంచి కాతేరు వైపు డ్రెడ్జింగ్ బోట్లు బహిరంగంగానే కనపడుతున్నాయి. ఆయా ర్యాంపుల నిండా డ్రెడ్జింగ్ బోట్లే. ఇసుక మాఫియాకు కనీసం భయం లేదు. రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో ఇసుక దోపిడీకి అంతులేకుండా పోయింది.నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.కనీసం కలెక్టర్ ఆ దిశగా చేపట్టిన చర్యల్లేవ్..ఇసుక అక్రమాలు అరికట్టడానికి నియమించిన టాస్క్‌ఫోర్స్‌కు డ్రెడ్జింగ్ కనిపించకపోవడం గమనార్హం. గోదావరిలో యంత్రాలతో గుల్లబొడు స్తున్నా ఇరిగేషన్ అధికారులు అసలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ వర్షాకాలం వచ్చే వరకూ ఈ ఇసుక దోపిడీకి అడ్డుకట్ట లేనట్టే. అధికారులు పట్టించుకుని ఈ అక్రమాలు నియంత్రించగలిగితే ఉచిత ఇసుక విధానం మరింత ఫలి తాలనిస్తుంది. వినియోగదారుడికి తక్కువకు అందుతుంది. అధికారులు ఇసుక దోపిడీ అరికట్టాలి.

మీ విజన్ మారాలి!

విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సులో సీఎం చంద్రబాబు

- అభివృద్ధికి ఆస్కారం ఉంది
- కోనసీమలో తలసరి ఆదాయం పెంచండి
- కాకినాడ-అనకాపల్లి మధ్య ఎయిర్‌పోర్టు
- కడియం నర్సరీలు అభివృద్ధి చేయాలి



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ,కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లో అభివృద్ధికి చాలా ఆస్కారం ఉంది.కానీ ఆ స్థాయిలో ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు ఈ జిల్లాలను విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో చేర్చిన నేపథ్యంలో విజన్‌ప్లాన్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. జిల్లా కలెక్టర్లకు ఈ రోజు నుంచే రన్నింగ్‌రేస్ మొదలైనట్టు అని సీఎం చంద్రబాబు పేర్కొ న్నారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సు గురువారం విశాఖలో జరిగింది.రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల కలెక్టర్లను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. సదస్సులో కాకి నాడ, కోనసీమ కలెక్టర్లు షాన్‌మోహన్, మహేష్, తూర్పుగోదావరి నుంచి మరికొందరు అధికారులు హాజరయ్యారు. ఎకనమిక్ రీజియన్ పరిధిలోని జిల్లాల్లో ప్రస్తుత స్థితిగ తులు, భవిష్యత్తు అభివృద్ధి ఏవిధంగా చేయాలనే దానిపై ప్రత్యేక బుక్‌లెట్‌ను సీఎం ఆవిష్కరించారు.రీజియన్ పరిధి లోని జిల్లాల్లో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడానికి పెద్ద ఎత్తున కలెక్టర్లు కృషిచేయాలని ఆదేశించారు.పర్యా టక ఈవెంట్లు,ఎగ్జిబిషన్లు తరచూ జరగాలని సూచించారు. విశాఖ నుంచి చెన్నై వరకు ప్రస్తుతం ఉన్న రెండు రైల్వే లైన్లు భవిష్యత్తులో నాలుగుకు పెరగబోతున్నాయని తద్వా రా రైళ్ల వేగం పెరుగుతుందన్నారు. సముద్ర తీరం, హైవేలు విస్తృతంగా ఉన్నాయని, ఎయిర్ కనెక్టవిటీని పెంచడం కోసం కాకినాడ-అనకాపల్లి మధ్య చిన్న ఎయిర్ పోర్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లాలో అద్భుతమైన కడియం నర్సరీలు ఉన్నాయని,వీటిని ఇంకా లాజికల్‌గా మరింతగా అభి వృద్ధి చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నా సరే వాటిని మరింతగా ప్రమోట్ చేయడం లేదని దీనిపైనా దృష్టిసారించాలని సూ చించారు.సముద్రం,నది ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో రివర్‌క్రూయిజ్‌కు చాలా భవిష్యత్తు ఉందన్నారు. అన్నవరం నుంచి శ్రీకాకుళం వరకు టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు.విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో జిల్లాల అభివృద్ధికి తరచూ సమీక్షలు జరగాలని, ఈ రీజియన్‌కు చైర్మన్‌గా తానే వ్యవహరిస్తానని చంద్రబాబు అన్నారు.

తూర్పుగోదావరి జిల్లా తలసరి ఆదాయం రూ.2.59 లక్షలు

తలసరి ఆదాయంలో కోనసీమ జిల్లా చాలా వెనుకబడి ఉందని సీఎం గుర్తు చేశారు.ఆ జిల్లా కలెక్టర్ ఇక్కడే ఉన్నారు..ప్రజల తలసరి ఆదాయం పెంచకపోతే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. దీనిపై దృష్టిసారించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని ఆదేశించారు. రీజియన్‌లోని తొమ్మిది జిల్లాల్లో ప్రజల తలసరి ఆదాయాలను ప్రస్తా వించారు. కాకినాడ జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2.42 లక్షలు, కోనసీమ రూ.2.06 లక్షలు, తూర్పుగోదావరి జిల్లా 2.59 లక్షలుగా ఉందన్నారు. ఇకపై రీజియన్ పరిధిలో జిల్లాల్లో అభివృద్ధిని పరుగులు తీయించడానికి విజన్ ప్లాన్ అమ లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలు ఏ అంశాల్లో బలంగా ఉన్నాయి.. ఎక్కడ వెనుకబడి ఉన్నాయో గుర్తించి అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.కాకినాడలో రెండు పోర్టులను విదేశీ ఎగుమతులు దిగుమతులకు ఎక్కువగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సాగుపై రీఓరియంటేషన్ జరగాలన్నారు.



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 14 రకాల పరీక్షలు

సీతానగరం,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని నేషనల్ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ సభ్యులు డా.నాగరాజు, డా. సుదర్శన్ తెలిపారు. సింగవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలను గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల టెస్టులు చేస్తారన్నారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకె చైతన్య, సర్పంచ్ సంగన పోశియ్య, కె . నవీన, ఎస్.సుధ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో శనివారం (15న) జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత ఉండాలన్నారు. 19-40 ఏళ్ల మధ్య వారు మేళాకు రావొచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్యా వెబ్ పోర్టల్, ఎంప్లాయిమెంట్ పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

13న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లు న్యాయాన్ని ప్రజలకు సులభంగా త్వరితగతిన తక్కువ వ్యయంతో అందించే వేదికలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు.చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.సంస్థల్లో రాజీకి యోగ్యమైన కేసులను గుర్తించి, ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు.



పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి , ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు

పుష్కర ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027ను సమర్థవంతంగా నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పుష్కరాల ప్రాథమిక సమీక్ష సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో వారి సూచనలు, సలహాలను అధికారులు తయారు చేసే ప్రతిపాదనలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గత పుష్కరాల సమయంలో భారీ జనసమ్మర్థం, రవాణా సౌకర్యాలు, భద్రత, శానిటేషన్, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాల వారీగా చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, ఆర్టీసీ తదితర శాఖలు పీపీటీ ద్వారా సమగ్రంగా వివరించాయన్నారు. రానున్న సమావేశంలో ఇరిగేషన్, దేవాదయ, రైల్వే, రవాణా, విద్యుత్, మునిసిపల్ శాఖలు 2003, 2015 పుష్కరాల్లోని అనుభవాలతో పాటు భవిష్యత్ ప్రణాళికలను సమర్పించాలన్నారు. రానున్న పుష్కరాల నిర్వహణలో స్మార్ట్ మానిటరింగ్, ఐసీసీసీ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, ఏఐ టెక్నాలజీ, డిజిటల్ ఇన్వెంటరీ సిస్టం వంటి ఆధునిక పద్ధతులు కీలకమన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం రెండు చోట్లా పుష్కర స్నానాలు ఆచరించే క్రమంలో భక్తుల సంఖ్యను ముందస్తు అంచనా వేయాలన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవం, సాంప్రదాయ విధానాలు, గోదావరి పుష్కరాలకు సంబంధించిన విశిష్ట ఆచారాలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలను సమగ్రంగా ప్రతిబింబించే విధంగా దేవాదయ, సాంస్కృతిక శాఖలు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. గోదావరి ఆధ్యాత్మికలను మరింత వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల పర్యవేక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో అమలు చేసిన స్మార్ట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శానిటేషన్, డిజిటల్ కమ్యూనికేషన్, ఐసీసీసీ ఆధారిత పర్యవేక్షణను ఏపీఎంజీ కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ప్రశాంత్ వివరించారు. గోదావరి పుష్కరాలకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ లేఅవుట్, మోడల్ ప్లాన్‌ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ మేఘాస్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ, ఆర్డీవోలు పాల్గొన్నారు.



భూములపై చర్చిస్తున్న ఆర్‌డీవో కృష్ణనాయక్

కోరుకొండలో భూముల రికార్డుల పరిశీలన

కోరుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో 1,202.34 ఎకరాల భూములు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పేరున ఉన్నట్టు గుర్తించామని రాజమహేంద్రవరం ఆర్‌డీవో ఆర్.కృష్ణ నాయక్ తెలిపారు. కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ ఎం.సత్యనారాయణ, ఆర్‌డీవో కృష్ణనాయక్ సంయుక్తంగా ఎండోమెంట్ భూములపై గురువారం సమీక్షించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి పేరున ఉన్న జిరాయితీ భూముల రికార్డులను పరిశీలించారు. కోరుకొండ గ్రామంలో మొత్తం విస్తీర్ణం 1,616.45 ఎకరాలు కాగా అందులో పోరం బోకు భూములు 414.11 ఎకరాలు మిగిలిన 1,202.34 ఎకరాలు ఎండోమెంట్‌కి సంబంధించినట్టుగా రిజిస్టర్‌లో నమోదైనట్టు తెలిపారు. వీటిలో జిరాయితీగా ఉన్న 259.20. ఎకరాలకు సంబంధించిన సర్వే నెంబర్లను పరిశీలించి సవరిస్తామన్నారు. కోరుకొండలో సర్వీస్ ఇనాం భూములుగా ఉన్న 130.63 ఎకరాలను రికార్డుల్లో సరిచేసి సర్వీస్ ఇనాం భూములుగా మారేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మాస్టారు : ఒక 20 ఏళ్ల కుర్రాడు.. చదువులో ఫస్ట్..మాస్టారి ప్రియశిష్యుడు. ఆ అభిమానంతో బాల్యం గురించి చెప్పమని స్టేజ్‌పైకి పిలిచారు..

విద్యార్థి : మాస్టారిని చూసి బాల్యం గురించి ఏం చెబుతాం సార్ అన్నాడు.. అది విన్నవారంతా ఒక్కసారి అవాక్కయ్యారు..

మాస్టారు : నీకు బాల్యం లేదా అని మాస్టారు తిరిగి ప్రశ్నించాడు..

విద్యార్థి : వెంటనే ఉంది సార్..

మాస్టారు : అయితే చెప్పు అన్నారు..

విద్యార్థి : బాల్యం గురించి చెప్పడం మొదలుపెట్టాడు.. చదివిన పాఠశాల.. ర్యాంకులు తప్ప.. ఏమీ లేదు..



మాస్టారు : ఇదేనా నీ బాల్యం..

విద్యార్థి : అవును సార్.. మా అమ్మానాన్న ఉద్యోగులు.... నేను చిన్నతనం నుంచి హాస్టల్ ఉండి చదువుకున్నా అని తన బాల్యం గురించి చెప్పుకొచ్చాడు.

మూరాలి.. అమ్మా..నాన్న!

ఈ తరం విద్యార్థులను ఎవరిని పలకరించినా ఇదే బాల్యం.. ఆటల్లేవ్.. పాటల్లేవ్.. తాత నానమ్మతో కబుర్లేవ్.. పుస్తకాలతో కుస్తీ.. ర్యాంకులతో దోస్తీ.. ఉరుకులు.. పరుగుల జీవితమే.. క్లాస్‌లో ఫస్ట్ వస్తేనే మాటలైనా.. ఆటలైనా లేదంటే అన్నీ కట్.. ఎటు పోతోంది బాల్యం.. ఏమైపోతోంది బాల్యం.. అందుకే ఒకనాడు కానరాని బాలల బలవన్మరణాలు మనం చూస్తున్నాం.. తల్లిదండ్రులారా బాల్యాన్ని బంధించవద్దు.. మీ బాల్యాన్ని మీ పిల్లల్లో చూడండి.. ఆడుకోనివ్వండి.. చదువుకోనివ్వండి.. వారికి మీలా బాల్యం గురుతులు ఉండేలా చూడండి.. నేడు బాలల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేడు బాలల దినోత్సవం



హ్యాపీ..హ్యాపీ డే!

బాలల దినోత్సవం పాఠశాలల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆయా పాఠశాలల్లో సందడి చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గౌతమి ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు గురువారం హ్యాపీ చిల్డ్రన్స్‌డే ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

మీకూ.. చట్టాలున్నాయ్!



(మండపేట -ఆంధ్రజ్యోతి)

నేటి బాలలే రేపటి పౌరులు.. దేశభవిష్యత్ బాలల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారి గౌరవ ప్రదమైన జీవితానికి హక్కులు కల్పించింది.ఆ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను చేసింది. కానీ వాటిపై సరైన అవగాహన లేదు. బాలల హక్కుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై తెలుసుకుందాం..

- **జువైనల్ చట్టం :** ఇది 2015లో అమల్లోకి వచ్చింది. 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలంతా బాలలే.. నేరాల్లో చిక్కుకున్న లేదా రక్షణ అవ సరమైన పిల్లలకు న్యాయపరమైన రక్షణ కల్పిం చేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటయ్యాయి.బాల సంరక్షణ కమిటీ లు,పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- **విద్యాహక్కు :** బడి ఈడు పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2009లో ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. 6-14 సంవత్సరాలు వయసు కలిగిన బాలలకు కుల, ఆర్థిక అసమానతలకు అతీతంగా విద్యను హక్కుగా గుర్తించి అమలు చేస్తున్నారు.
- **బాలకార్మిక వ్యవస్థ నిరోధక చట్టం :** 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవటం నేరంగా భావిస్తూ 1986లో బాలకార్మిక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది.14-18 ఏళ్లలోపు పిల్లలను ఉద్యోగాల్లో పెట్టడాన్ని ఈ చట్టం నిరోధిస్తుంది.
- **రక్షణగా 1098 :** ఎవరైనా చిన్నారి ప్రమాదంలో ఉన్నారని తెలిస్తే చైల్డ్‌లైన్ నెంబరు 1098కు ఫోన్‌చేస్తే సంబంధిత అధికారులు స్పందించి రక్షణ కల్పిస్తారు. ఈ నెంబర్ 24 గంటలు అందుబాటులోనే ఉంటుంది.
- **బాల్యవివాహ నిషేద చట్టం 2006 :** 18 ఏళ్ల వయసున్న అమ్మాయిలు, 21 ఏళ్లలోపు వయ సున్న అబ్బాయిలకు పెళ్లి చేయడం నేరం. ఒక వేళ ఇలాంటి వివాహం జరిగినా చెల్లదు. చట్టరిత్యా కూడా నేరంగా పరిగణిస్తారు.
- **పోక్సో చట్టం :** లింగ వివక్ష లేకుండా 18 ఏళ్ల లోపు పిల్లలు లైంగిక దాడులకు గురైతే వారికి రక్షణ కల్పించడమే పోక్సోచట్టం(2012). నేర తీవ్రతను బట్టి జీవితఖైదు లేదా ఉరిశిక్ష విధిం చే అవకాశం ఉంది. కేసులు విచారణకు కేంద్రం ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసింది.
- **ఉచిత న్యాయ సహాయం :** న్యాయ సేవాధి కార చట్టం ప్రకారం బాలలందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులే.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో న్యాయసేవాధికార సంస్దను సంప్ర దించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు.

పిల్లలను చైతన్యపరచాలి

బాలల హక్కుల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికి వాటిపై అవగాహన లేక న్యాయం పొందలేక పోతున్నారు. పిల్లలను చైతన్య పరిచే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పాఠశాలలు ,కళా శాలల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకుని పిల్లలను చైతన్య పరచాలి.
- అబ్బులునాయుడు, న్యాయవాది, మండపేట

వీరి..వీరి గుమ్మడిపండు.. వీరి పేరేమి!

(మండపేట -ఆంధ్రజ్యోతి)

కాలం మారింది.. పల్లె జనం పట్టణ బాట పడుతున్నారు. వీరిలో పిల్లల చదువుల నిమిత్తం వచ్చే వారే ఎక్కువ. పూర్వం గ్రామాల్లో ఉండే ప్రభుత్వ పాఠ శాలల్లో పిల్లలను చదివించుకునేవారు. కానీ నేడు కార్పొరేట్ విద్యకు అలవాటు పడి ప్రైవేటు విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించి వారి కోసం తల్లిదండ్రులు పట్టణాల బాట పడుతు న్నారు. మార్కులు ర్యాంకులు మంచి కళాశాలలో సీట్లకు పిల్లలను ఆటపాటలకు దూరం చేస్తున్నారు. చదువుల పేరిట పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లలకు తల్లిదండ్రులతో పాటు తాత బామ్మ, మావయ్య, చిన్నాన్న, చిన్నమ్మ, పెద్దమ్మ, అత్తమామ ఇలా అనేక బంధాలు ఉండేవి.కానీ నేటి పిల్లలకు అంకుల్ అంటీ పేర్లు తప్పించి అసలు బంధువులెవరు వారేమవు తారో కూడా తెలియని పరిస్థితి.నోరారా తాతయ్య అమ్మమ్మ, నానమ్మ, మావయ్య అమ్మానాన్న అన్న తమ్ముడు పేర్లు కూడా పిల్లల నోట విందామన్న వినిపించడం లేదు. కారణం నేడు ప్రైవేటు పాఠశాలల్లో చదువుల చట్రంలో పిల్లలు బందీలుగా మారిపోతు న్నారు. ర్యాంకులు మార్కులు పేరిట పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నలిగిపోతున్నారు. పిల్లలు ఆడిపాడే సమయం లేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పూర్వం పిల్లలకు బామ్మ తాతయ్యల నీతికథలు చెప్పేవారు..పాతకాలంనాటి జ్ఞాపకాలు చెప్పేవారు. ఎలా ఉండకూడదో .. ఎలా ఉండాలో చెప్పేవారు.. అందుకే నాడు చిన్నారులకు ఆత్మహత్య అంటే కూడా ఏంటో తెలి యదు.. నేడు వారేవరు పిల్లలకు దగ్గరగా ఉండకపోవడం వారంతా పల్లెల్లో ఉండడం చదువుల పేరిట పట్టణాల్లో పిల్లలు ఉండడం వల్ల పిల్లల పల్లె బంధాలకు దూరమవుతూ పట్టణ వాతావరణంలో ఉండిపోతున్నారు. కేవలం పండుగల సమయంలో తప్ప పల్లె వాతావరణం గురించి పిల్లలకు తెలియడం లేదు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌కు బంధీగా మారిపోయారు. పూర్వం నీతికథల పుస్తకాలు చదువుకునేవారు.కానీ నేడు అంతా సెల్‌లో ఆటలు ఇంటర్‌నెట్‌లో పాఠాలు, సినిమాలతో బాల్యం గడిచి పోతుంది.

- చిన్ననాటి చిరు గురుతుల్లేవ్
- బంధువులులేరు.. సమయమూ లేదు..
- చదువుల పేరిట పట్టణాలకు క్యూ
- 24 గంటలూ పుస్తకాలతో కుస్తీ
- బందీగా మారుతున్న చిన్నారులు
- మానసిక ఒత్తిడిలో బాల్యం

పూర్వం పిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే తోటిపిల్లలతో ఏడుపెంకెలు ఆట, గోలీలు కోతి కొమ్మచ్చి, వాలీబాల్, షటిల్, పరుగుపందాలు, వీరివీరి గుమ్మడిపండు, అష్ట చమ్మా వంటి ఆటపాటలతో ఆనందంగా గడిపేవారు. నేడు అవేమీ మచ్చుకు కనిపించడం లేదు. చదువులు పేరిట పట్టణ బాట పట్టిన చిన్నారులు జంక్‌ఫుడ్ రుచులకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారు. నేడు అమ్మచేతి వంట పిల్లలకు రుచించడం లేదు.





సెల్ సిగ్నల్ రావే.. మా బుజ్జాయికి బువ్వ తినిపించవే!

(ఉప్పలగుప్తం-ఆంధ్రజ్యోతి)

తల్లిదండ్రుల మాట తీరు, అందించే ఆహారం పిల్లల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. చందమామ రావే! జాబిల్లి రావే!..... అన్నీ తెచ్చి మా పాపాయికియ్యవే... అంటూ ఆ కన్నతల్లి తన బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తోంది. తిననని మారాం చేస్తున్న పాపాయికి ఏవేవో కబుర్లు చెప్పి మభ్యపెట్టి మరీ ముద్ద నోటికందిస్తోంది. పెదాలు బిగబట్టి ససేమిరా అంటున్న తన బిడ్డకు నయానాభయానా ఆ కన్నతల్లి అన్నం తినిపించి అమ్మగా తన పాత్రకు పూర్తి న్యాయం చేస్తోంది. ఇది గత చరిత్ర. ఇప్పుడు చంటి బిడ్డకు గోరుముద్దలు తినిపించేంత సమయం ఎందరు తల్లులకుంది? తమ పనుల్లో తాము బిజీగా ఉంటున్న తల్లులు సెల్‌ఫోన్ చేతుల్లో పెట్టి పాపాయికి అన్నం తినిపించడం క్షణాల్లో కానిచ్చేస్తున్నారు. చందమామ కథలూ లేవు. బతిమాలి తినిపించడాలూ లేవు. మూడేళ్లు నిండిన బాలల్లో 80 శాతం మంది విద్యాలయాల్లోనే గోరుముద్దలు తింటున్నారు. గతంలో ఐదేళ్లు వచ్చే వరకు పిల్లలు ఇంటి వద్దే ఆటపాటలతో హాయిగా కాలం గడిపేవారు. ఈ కారణంగా వారి మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో దృఢంగా ఉండేది. మరిప్పుడు మూడేళ్లు రాగానే పిల్లలను విద్యాకేంద్రాలకు పంపించడంతో ఇరుకు గదుల్లో రోజంతా గడుపుతున్నారు. వాడిన ముఖాలతో ఇంటికొస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల జరిగిన ఒక సర్వే 40 శాతం పిల్లల్లో రక్తహీనత ఉన్నట్టు వెల్లడించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇది నడుస్తున్న చరిత్ర. అన్నప్రాసన అనంతరం తమ పిల్లల్లో వస్తున్న మానసిక మార్పులను తల్లిదండ్రులు నిశితంగా పరిశీలించాలి. ఏదైనా ఒక అంశంలో వారి స్పందన తీరును గమనించాలి. వారి ఇష్టాలు తెలుసుకుని మంచివైతే మద్దతివ్వాలి. చెడు విషయంలో వారికి అర్థమయ్యేరీతిలో అవగాహన కల్పించాలి. వారిలో మార్పు తీసుకురావాలి. ఇలా జరగాలంటే తల్లిదండ్రుల మాటతీరు పిల్లలకు నచ్చుబాటయ్యే విధంగా ఉండాలి. పిల్లల ఆహార విషయంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యానికి మాత్రమే ప్రాధాన్యమివ్వాలి.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువలో నీటి ప్రవాహం

ఏలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లోస్

అవుట్‌ఫ్లోస్ 775 క్యూసెక్కులకు పరిమితం

పిఠాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు అకస్మికంగా ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. కొన్ని రోజులుగా రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటి విడుదలను కొనసాగిస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు కొంతమేర తగ్గాయి. దీంతో ఇన్‌ఫ్లోస్ పెరిగినా ఎటువంటి ఇబ్బంది ఉండదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మండలాల నుంచి ఏలేరు రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోస్ ఉదయం 6 గంటలకు 1175 క్యూసెక్కుల నుంచి 1438 క్యూసెక్కులకు పెరిగాయి. అనంతరం తగ్గినా మరలా మధ్యాహ్నం 12 గంటలకు 2,630 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి వరకు ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లోస్ వస్తున్నాయి. కాలువలకు నీటి విడుదలను 975 క్యూసెక్కుల నుంచి 775 క్యూసెక్కులకు తగ్గించారు. ప్రస్తుతం డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 175 క్యూసెక్కులు పంపుతున్నారు.

ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.58 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.125 టీఎంసీలు ఉన్నాయి. గరిష్ఠ నీటిమట్టానికి మరో మీటరు ఉండగా, మరో రెండు క్యూసెక్కుల వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షం పడడమే ఇన్‌ఫ్లోస్ పెరగడానికి కారణమని ప్రాజెక్టు అధికారులు చెప్పారు.



హోప్ ఐలాండ్‌ను పరిశీలిస్తున్న అటవీ సంరక్షణాధికారి రామచంద్రరావు

హోప్ ఐలాండ్ సందర్శన

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా గురువారం కోరింగ అభయారణ్యం పరిధిలోని హోప్ ఐలాండ్‌ను పరిశీలించారు. తీరం వెంబడి ఆలివ్ రిడ్లీ టర్టిల్ నెస్టింగ్ ఏరియాలను చూవారు. ఐలాండ్‌లోను, తీర ప్రాంతంలోను ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని రేంజ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న మడ అడవుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓఎన్జీసీ జెట్టీ ప్రాంతంలో ముళ్ల పొదలను తొలగించాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, కోకోనట్ ప్లాంటేషన్, పాల్ మైరా ప్లాంటేషన్ ఏరియాలను పరిశీలించారు. ఆయన వెంట కోరింగ రేంజ్ అధికారి, సిబ్బంది వున్నారు.



అయినవిల్లిలో కొబ్బరికాయల మొక్కు తీర్చుకుంటున్న సాయిశ్రీనివాస్

కోనసీమ ఆలయాల్లో సినీ నటుడు బెల్లంకొండ పూజలు

అయినవిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ గురువారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తండ్రి సురేష్ 50వేల కొబ్బరికాయల మొక్కులో భాగంగా 10వేల కొబ్బరికాయల మొక్కును చెల్లించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం ఆయనకు ప్రధానార్చకుడు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రముఖ సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు మహదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సూపరింటెండెంట్ పి.విజయసారథి అందించారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ విచ్చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



వాడపల్లిలో దర్శనం....



అంతర్వేదిలో వేదాశీర్వచనం...

'పది'లో ఉత్తమ ఫలితాలకు 120 రోజుల కార్యాచరణ

విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి

గొల్లప్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో గతంలో కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 120 రోజుల కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి ఆదేశించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి వెనుకబడిన వారిని గుర్తించాలన్నారు. వారికి 120 రోజులు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. వారి ఉత్తీర్ణత బాధ్యతను సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు అందరూ తప్పనిసరిగా తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. అక్షరాలు రాని ఆరో తరగతి విద్యార్థులుంటే గుర్తించాలన్నారు. బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెజ్ బిరియానీ సరిగ్గా ఉడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు మండల విద్యా శాఖాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సూర్యప్రకాశరెడ్డి వున్నారు.



గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగమణి



మల్లికార్జునరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట భీమేశ్వరస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు

సామర్లకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు సతీ సమేతంగా గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాలను దర్శించిన మల్లికార్జునరావు దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. నంది మండపం వద్ద పండితులు చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలను ఈవో అందజేశారు. ఈవో నీలకంఠం ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుని తూర్పు చాళుక్యుల శిల్పకళా చాతుర్యానికి తన్మయులయ్యారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, వీఆర్వో నలజర్ల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



దేదీప్యశ్రీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న హెచ్‌ఎం మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు కుమారి

జాతీయ స్కూల్ చెస్ పోటీలకు దేదీప్యశ్రీ ఎంపిక

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో మూడు రోజులు జరిగిన బాలురు, బాలికల చెస్ టోర్నమెంటులో అండర్-17 బాలికల విభాగంలో పాల్గొన్న కాకినాడ శ్రీరామ్‌నగర్ మున్సిపల్ స్కూలు విద్యార్థిని ఎస్. దేవి దేదీప్యశ్రీ జాతీయ స్కూల్ చెస్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 27 నుంచి 30 వరకు త్రిపురలో జరిగే జాతీయ స్కూల్ చెస్ పోటీల్లో ఈమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ఎన్ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సీహెచ్ కుమారి విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



వరిచేలో కొంగలు కనువిందు

కాకినాడ జిల్లా పిఠాపురం జాతీయ రహదారి పక్కన వరిచేనులో గురువారం కొంగలు ఇలా సందడి చేశాయి. గుంపులు గుంపులుగా చేరి ఒకచోట నుంచి మరోచోటుకు ఎగిరిపోతూ.. మధ్యమధ్యలో ధాన్యం గింజలను తింటూ కడుపు నింపుకున్నాయి. ఈ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

అక్రమ కట్టడాలపై కొరడా!

- వెంటనే కూల్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- జీవో నెం.225 విడుదల
- అనుమతి లేని నిర్మాణాలకు బీపీఎస్-2025 ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం
- దరఖాస్తుకు 120 రోజుల గడువు



కాకినాడ 40వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చాలని స్పష్టం చేసింది. ఈ మేరకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్-2025) మార్గదర్శకాలను విడుదల చేస్తూ జీవో నెం.225ను మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ బుధవారం జారీ చేసింది. భవనాల యజమానులు 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మించిన అనుమతి లేని (లేదా) నిబంధనలకు విరుద్ధమైన భవనాలను ఒకసారి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, సీఆర్‌డీఏ, వీఎంఆర్‌డీఏ, ఐఏఎల్‌ఏ పరిధిలోని గ్రామ పంచాయతీలు కూడా ఈ పథకం కిందకి వస్తాయి.

దరఖాస్తుకు గడువు

నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి 120 రోజులు మాత్రమే. ఇది తుది అవకాశమని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీటికి అవకాశం లేదు

ప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, సాగర తీరం, నదీ తీరం, వాగు వెంబడి, ట్యాంక్ బండ్, మాస్టర్ ప్లాన్‌లో రోడ్లు, ఓపెన్ స్పేస్, పార్కుకు వినియోగించే ల్యాండ్‌లు, 2025 ఆగస్టు 31 తర్వాత కట్టిన నిర్మాణాలు, ల్యాండ్ డిస్ప్యూట్ ఉన్నవాటికి అర్హత లేదు.

ఎలా దరఖాస్తు చేయాలి...

www.bps.ap.gov.inలో రిజిస్ట్రేషన్ సేల్‌డీడ్ కాపీ, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్, ప్లాన్ (ఉంటే), బిల్డింగ్ ఫొటోలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ (స్ట్రక్చరల్ ఇంజనీర్ నుంచి), ఇండెమ్నిటీ బాండ్‌లను దరఖాస్తుతో తప్పనిసరిగా జత చేయాలి. దరఖాస్తు ప్రారంభ రుసుము రూ.10వేలు చెల్లించి మిగతా జరిమానా మొత్తాన్ని 120 రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది.

రాయితీలు-ప్రత్యేక నిబంధనలు:

1997 డిసెంబరు 31లోపు పాత భవనాలకు 25 శాతం తగ్గింపు, స్లమ్ ప్రాంతాల్లో 50శాతం తగ్గింపు.

ఎవరకి వర్తింపు:

1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య కట్టిన భవనాలకు బీపీఎస్ వర్తిస్తుంది.

గతంలోనూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే...

రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని మరోసారి మరోసారి తీసుకొచ్చింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనుమతులు లేని భవనాలను క్రమబద్ధీకరించడా నికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా నగర, పట్టణ ప్రజలు తమ నిర్మాణాలను, ప్లాట్లను చట్టబద్ధం చేసుకునే అవకాశముంటుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చింది. అయితే గడువు ముగియడంతో నిలిపివేశారు. అప్పటి దరఖాస్తుల్లో చాలా వరకు పరిష్కారమయ్యాయి. గత ప్రభుత్వంలో అనుమతులు లేకుండా చాలా నిర్మాణాలు జరిగాయి. ఇప్పుడు వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇస్తోంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేసింది. అయితే ఆ గడువు ముగియడంతో ఆ తర్వాత వాటిని ఆపేశారు. అప్పటి దరఖాస్తుల విషయానికి వస్తే బీపీఎస్‌కు సంబంధించి 90శాతం వరకు పరిష్కారమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతులు తీసుకోకుండా చాలా భవనాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలు జరిగాయి. దీనికి కారణం ఆ పార్టీ నేతల అండదండలు ఉండటమే. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలొచ్చాయి. ఇటీవల చేపట్టిన ఇంటింటి సర్వేలో ఈ విషయాలన్నీ బయటపడడంతో ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం



ప్రభుత్వం చివరి అవకాశంగా ఈ సంవత్సరం ఆగస్టు 31తో పూర్తయిన భవంతులకు బీపీఎస్ ద్వారా అవకాశం కల్పించింది. ఈ పథకం ద్వారా అనుమతులు లేకుండా లేదా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు, అనధికార నిర్మాణాలకు అపరాధ రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. అటువంటి నిర్మాణాలు కూల్చివేస్తాం

- కృష్ణారావు, డిప్యూటీ సిటీ ప్లానర్, కాకినాడ నగరపాలక సంస్థ

జయ జయ.. సత్యదేవా

- పసుపుమయమైన అన్నవరం
- 3వేలమంది సత్యదీక్షల విరమణ
- ఉచిత సామూహిక వ్రతాలు

అన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి గురువారం సత్యదీక్షాపరులతో పసుపుమయంగా మారింది. 27 రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో దీక్షలు చేపట్టిన సత్యదీక్షాపరులు దీక్షలను విరమించారు. శిరసున ఇరుముడులు పెట్టుకుని పలువురు మెట్టమార్గం, మరికొందరు వివిధ వాహనాల్లో స్వామి సన్నిధికి చేరుకున్నారు. వారందరికీ వార్షిక కల్యాణ వేదికపై ఉన్న అర్చకస్వాములు ఇరుముడులను స్వీకరించారు. వీటిని స్వామిపాదాల చెంతఉంచారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఏర్పాటు చేశారు. సుమారు 3వేలమంది సత్యదీక్షలను విరమించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు





ఇరుముడులు సమర్పిస్తున్న సత్యదీక్షాపరులు

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవరులకు జన్మనక్షత్రపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. ఈ సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలతో మంత్రపూర్వకంగా అభిషేకం చేపట్టారు. అనంతరం నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి సుగంధభరితపుష్పాలతో అలంకరించి సర్వదర్శనాలకు భక్తులను అనుమతించారు. యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించగా ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వంతో ఎంవోయూ



విజయవాడలో డీఎంఈకి ఎంవోయూ అందజేస్తున్న రాంకోసా ప్రతినిధులు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (రాంకోసా) ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఆర్ఎంసీ ప్రధాన భవనం పాతది కావడంతో దాని బలోపేతం కోరుతూ రాంకోసా బృందం చేసిన విన్నపానికి స్పందించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గురువారం విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో బృందం డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్‌ను కలిసింది. ఈ నేపథ్యంలో రాంకోసా ప్రతినిధులు డీఎంఈని కలిసి రూ.15 కోట్లతో భవనాలు నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. బిల్డింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, రాంకోసా కార్యదర్శి డాక్టర్ అరుణాదిత్య, డాక్టర్ వాడ్రేవు రవి పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అమలాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలోని కూచిమంచివారి అగ్రహారం శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. జనుపల్లికి చెందిన కడలి మహేష్, మురళీ దుర్గాప్రసాద్ (ముమ్మిడివరం), గ్రంధి ప్రసాద్ (అమలాపురం), అమలదాసు వెంకటేశ్వరరావుతో పాటు పట్టాభివీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన మహిళను అరెస్టు చేశారు. రూ.2వేలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గుండెపోటుతో వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ డ్రైవర్ మృతి



శ్రీనివాసు (ఫైల్)

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఉన్న వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ కారు డ్రైవర్ కే.శ్రీనివాసు (53) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. శ్రీనివాసు సామర్లకోటలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు కాకినాడ వ్యవసాయశాఖ జేడీ కార్యాలయానికి బయలుదేరడానికి సిద్ధం అవుతుండగా గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన్ని హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఎన్నో ఏళ్లగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి కారు డ్రైవర్‌గా పని చేస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఇతర ఏడీలు, ఏవోలు, మినిస్టీరియల్ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది, ఎఫ్‌టీసీ సిబ్బంది సామర్లకోటలో ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. శ్రీనివాసు పార్థివదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు.

డ్వాక్రా సొమ్ములు స్వాహా..

- పెద్దాపురం మండలం వడ్లమూరులో డ్వాక్రా వీవోఏ చేతివాటం
- దశలవారీగా రూ.28లక్షల మాయం
- పోలీసులకు ఫిర్యాదు

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ములను బ్యాంకులకు జమ చేయకుండా వెలుగు వీవోఏ స్వాహా చేసిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం వడ్లమూరులో జరిగింది. ఈ విషయంపై ఏపీఎం పి.సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... డ్వాక్రా వీవోఏగా పనిచేస్తున్న పువ్వుల గంగాభవాని మహిళా సమాఖ్య సంఘాల సభ్యుల నుంచి సొమ్ములు వసూలు చేసి... వాటిని బ్యాంకుకు చెల్లించకుండా సొంత ఖర్చులకు వినియోగించుకుంది. సుమారు 40మంది నుంచి రూ.28లక్షలు దశల వారీగా స్వాహా చేసింది. విషయం వెలుగులోకి రావడంతో ఏపీఎం సూర్యనారాయణ పోలీసులు, వెలుగు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏపీఎం సూర్యనారాయణను వివరణ కోరగా దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాయవరంలోనూ..

రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సొమ్ములు బ్యాంక్‌కు జమ చేయకుండా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం వెలుగు యానిమేటర్ రూ.107500 పక్కదోవ పట్టిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు వైదేహి గ్రూప్ అధ్యక్షురాలు కచ్చా శ్రావణి తెలిపింది. శ్రావణి మాట్లాడుతూ "తమ గ్రూపునకు సంబంధించి సొమ్ములను పలు దఫాలుగా బ్యాంక్‌కు కట్టినట్టు చూపి యానిమేటర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.70వేలతో పాటు మరో రూ.24 వేలు కలిపి మొత్తం రూ.94 వేలు.. ఇలా మొత్తంగా రూ.107500 సొమ్ములు స్వాహా చేసింది' అని పేర్కొంది. తమకు నకిలీ బ్యాంక్ స్లిప్‌లు ఇచ్చారని, తాము చెల్లించిన సొమ్ములకు ఆఫీసు రికార్డుల్లో వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై వెలుగు ఏపీయం కె.నాగేశ్వరరావును వివరణ కోరగా వైదేహి గ్రూపు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాలపై సంఘం లావాదేవిలపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం



మరిడమ్మ

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రం మఖను పురస్కరించుకుని గురువారం పంచామృతాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేశారు. బంగారు, వెండి పుష్పాలతో అర్చన అనంతరం ప్రసాద వితరణ గావించారు. ఆలయ సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఖమ్మం జిల్లా పేర్వంచకు చెందిన పరిమి నవీన్, నాగమణి దంపతులు రూ.1,11,116 విరాళంగా ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు. దాత సత్యదీక్షను స్వీకరించి 27రోజులపాటు నియమనిష్టలతో ఆచరించి గురువారం విరమించడం విశేషం.

వేంకటేశ్వరస్వామి ఆదాయం రూ.14.04 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామిదేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ట్రస్టీల సమక్షంలో పోలీసులు బందోబస్తు నడుమ లెక్కింపు చేపట్టారు. 2 నెలల 15 రోజులకు గాను ప్రధాన హుండీ ఆదాయం రూ.11,48,271, శ్రీలక్ష్మీ గణపతి హుండీ ఆదాయం రూ.30,378, వైష్ణవీకనకదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1,20,281, శ్రీజ్ఞానసరస్వతి హుండీ ఆదాయం రూ.45,218 రాగా మొత్తం రూ.14.04లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యకుమార్ పేర్కొన్నారు.

పోస్టాఫీసుల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు

సీనియర్ సిటిజన్లకు ఎంతో సౌకర్యవంతం

కాకినాడ డివిజన్ సూపరింటెండెంట్ కృష్ణ

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు అందుబాటులో ఉన్నాయని తపాలా శాఖ కాకినాడ డివిజన్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. ఈ సేవలు సీనియర్ సిటిజన్లకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. పెన్షనర్లు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అందించే డోర్‌స్టెప్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సర్వీస్ ద్వారా గానీ, సమీపంలోని పోస్టాఫీసును జనరేట్ చేస్తారన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ జనరేట్ కోసం పోస్ట్‌మ్యాన్/గ్రామీణ డాక్ సేవక్ ద్వారా జీఎస్టీతో సహా నామమాత్రపు లావాదేవీ రుసుం రూ.70 వసూలు చేస్తారన్నారు. ఈ సేవ కోసం పెన్షనర్ ఆధార్ నెంబరు, పెన్షన్ వివరాలను అందించాలన్నారు. సర్టిఫికెట్ జనరేట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పెన్షనర్ తన మొబైల్ నెంబరుకు నిర్ధారణ ఎస్ఎంఎస్ అందుకుంటారన్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్‌ను మరుసటి రోజు పోర్టల్‌లో చూడవచ్చన్నారు. ఇందుకు పెన్షనర్లు సమీపంలోని పోస్టాఫీసును గానీ, పోస్ట్‌మ్యాన్, డాక్ సేవక్‌ను గానీ సంప్రదించాలన్నారు. వారు ఇంటింటికీ సేవ అందించడానికి, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ జనరేట్ చేయడానికి అభ్యర్థించే వ్యక్తిని చిరునామాలో కలుస్తారన్నారు. అందువల్ల పెన్షనర్లు ఈ డోర్‌స్టెప్ లైఫ్ సర్టిఫికెట్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

సాంకేతికతపై యువత పట్టుసాధించాలి

● నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతికత పురోగతిపై యువత పట్టు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో పెర్కిన్ ఎల్మెర్ సహకారంతో ఆధునిక విశ్లేషణాత్మక సాంకేతికతలో ఇటీవల పురోగతి అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ యు.ఎస్.ఎ.లోని పెర్కిన్‌ఎల్మెర్ విశ్లేషణాత్మక పరికరాలు, రోగనిర్ధారణ, జీవశాస్త్రాలు, పర్యావరణ పరిరక్షణలో ఆవిష్కరణలకు అంకితమైన శాస్త్రీయ సాంకేతిక సంస్థ అని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ సంస్థ నన్నయ విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధన విశ్లేషణాత్మక ఆవిష్కరణల పురోగతికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈవిద్యాపరిశ్రమ సహకారం ద్వారా విశ్వవిద్యాలయం శాస్త్రీయ శిక్షణను బలోపేతం చేయడానికి అంతర్ విభాగ పరిశోధకులను ప్రోత్సహించడానికి, ప్రపంచ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పెర్కిన్‌ఎల్మెర్ ప్రాంతీయ సేల్స్ మేనేజర్ అచ్యుతరావు మాట్లాడుతూ తమ సంస్థ ఎనిమిది దశాబ్ధాలకుపైగా శాస్త్రీయ ఆవిష్కరణ, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

నేటి నుంచి నన్నయలో గణితంలో బ్రిడ్జి కోర్స్ ప్రారంభం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యంలో సంభావ్యత , గణాంకాలపై శుక్రవారం నుంచి బ్రిడ్జికోర్స్ ప్రారంభిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం పలు వివరాలను తెలిపారు. విశ్వవిద్యాలయంలోని రెండవ సంవత్సరం విద్యార్థులందరికీ ఈ బ్రిడ్జికోర్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకూ సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ తరగతులు జరుగుతాయని చెప్పారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. పీజీ ప్రోగ్రామ్‌లను బాగా అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. పీజీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ ంలో గణితశాస్త్ర విభాగాధిపతి టి.హైమావతి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుపై నమ్మకంతో

రాష్ట్రానికి పెట్టుబడులు

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరంసిటీ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పెట్టుబడులు తిరిగి వస్తున్నాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఈమేరకు గురువారం ఎమ్మెల్యే ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడుల హబ్‌గా నిలుస్తోందన్నారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలోకి రీన్యూవవర్ పెట్టుబడులు పెడుతుందని, రీన్యూ పవర్ రూ.82వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైనట్లు ప్రకటించడమే అందుకు నిదర్శనమన్నారు. 2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పీపీఏలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని దీంతో నాడు రెవెన్యూ ఎనర్జీ సంస్థ పీపీఏల రద్దు దుమారంతో రాష్ట్రానికి గుడ్‌బై చెప్పేసిందని, టీడీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న పీపీఏ ఒప్పందాలను కక్ష పూరితంగా నాడు జగన్ ప్రభుత్వం రద్దుచేసి రాష్ట్రం నుంచి పారిశ్రామికవేత్తలను వెళ్లగొట్టేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. పీపీఏల రద్దు వ్యవహారం నుంచే రాష్ట్రం ఇమేజ్ డామేజ్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్ధాల సుదీర్ఘ అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేయిస్తున్నారని, అంతర్జాతీయంగా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్ అని ఆయనే మన సీఎం చంద్రబాబు అని అన్నారు. ప్రభుత్వం వచ్చిన16నెలలో రాష్ట్రానికి రూ11.20 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి రావడంతో 9.5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.25.70లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను, రూ.11.30లక్షలతో నిర్మించిన మూడు సీసీ డ్రైన్లను ఎమ్మెల్యే ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని 16నెలల్లో చేసి చూపామని అన్నారు. వైసీపీ పాలనలో కనీసం రోడ్లపై ఉన్న గుంతలు కూడా పూడ్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ఉందని రాష్ట్రంలో పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అనేక దేశాల నుంచి వివిధ కంపెనీల ఏర్పాటు కు కృషిచేస్తున్నారని రానున్న రోజుల్లో ఏపీ పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగావకాశాలు ఇస్తామని ఇచ్చినమాట ప్రకారం ఉద్యోగాల జాతర జరుగనుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని, కూటమి నాయకులు కర్రి శేషారత్నం, కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, మాజీ సర్పంచ్ తేనెల శ్రీనివాస్, కర్రి చిన్నారెడ్డి, పోతంశెట్టి సుబాషిణి. ఎంపీటీసీ గొలుగూరి గౌతమి, జనసేన అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కె ప్రసాదరెడ్డి, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామవరంలో సీసీ రోడ్లను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


ఎస్‌ఏ-1 పరీక్షను పరిశీలిస్తున్న హెచ్‌ఎం కన్నారావు

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

● ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ అమలకుమారి

రంగంపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): 2026 మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయటానికి అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.అమలకుమారి సూచించారు. గురువారం రంగంపేట మండలంలోగల రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఆమె మాట్లాడారు. మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, తరగతి గదులలో బెంచీలు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్. ఎం.ఎం.ఎస్ పరీక్షలలో కూడా తర్ఫీదు ఇవ్వాలని ఆమె తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో శాస్త్రీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో అద్భుత విజయాలు సాధిస్తున్న రంగంపేట హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ కృషిని ఆమె అభినందించారు. పదోతరగతి పరీక్షా కేంద్ర తరగతులు ఏర్పాటు గురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.బి.కెసుభాకరరెడ్డి, దాట్ల అరుణ, వరలక్ష్మీలు వివరించారు. వీరి వెంట రంగంపేట మండల విద్యాశాఖాధికారి పి.మధుసూధనరావు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


రంగంపేట హైస్కూల్లో ఉపాధ్యాయులతో ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ అమలకుమారి

పది పరీక్షా కేంద్రాల పరిశీలన

దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానకు సంబంధించి మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసే పాఠశాలలనుజిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఎం.అమలకుమారి గురువారం సందర్శించారు. మండలంలోని దివాన్‌చెరువు, కానవరం, నరేంద్రపురం, రాజానగరం, సంపత్‌నగరం, తోకాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను, స్థానిక సూర్యగ్లోబల్ ఇంగ్లీషుమీడియం స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ విద్యాసంవత్సరంకు సంబంధించి పరీక్షా కేంద్రాలను పరిశీలించామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయడానికి మండల విద్యాశాఖ అధికారులకు తగిన సూచనలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సీ పరీక్షల సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు రాజ్‌కుమార్, హనుమంతు, ఎంఈవో జి.జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడతా

● కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది
● వైసీపీ విమర్శలు తిప్పికొట్టాలి
● క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీల ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిని అగ్రగామిగా నిలబెడదామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ప్రియాకంలో గురువారం రాత్రి రూరల్ నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ యూనిట్, గ్రామ, మండలవార్డు అనుబంధ కమిటీల ప్రమాణస్వీకారం జరిగింది. దీనికి గోరంట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఇన్‌చార్జిలతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అరాచాకాలపై సమిష్టిగా పోరాటం చేశామని గుర్తుచేశారు. అరాచకాలను ఎత్తి చూపిస్తూ సహేతుకంగా విమర్శలు చేశామన్నారు. ముందు వరుసలో ఉండి పోరా టం చేశామన్నారు. గత ప్రభుత్వం మనపై ఒక్కకేసు కూడాపెట్టలేకపోయిందని కార్యకర్తలపై ఈగ వాలనివ్వలేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలుచేస్తున్నారని చెప్పారు. రూరల్‌లో ఇప్పటికే కోట్లాదిరూపాయాల పనులు జరుగుతున్నాయని మరో రూ30కోట్ల పనులు మంజూరవుతున్నాయని త్వరలోనే అంచనాలు రూపొందించి పనులు చేపడతారని గోరంట్ల చెప్పారు. వైసీపీ విమర్శలను తిప్పికొట్టాలన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు వస్తుందన్నారు. ఇప్పటికే చాలా మందిని కమిటీలలోకి తీసుకున్నామని జిల్లా కమిటీలో కూడా అవకాశాలు వస్తాయన్నారు. వయస్సు మళ్లిన కార్యకర్తలు కష్టాల్లో ఉంటే ఆదుకోవడం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తల గౌరవం పెంచేలా నడుచుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



క్లస్టర్ ఇన్‌చార్జిల ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

పేద మధ్యతరగతి కుటుంబాలలో సీఎం సహాయనిధి వెలుగులు నింపుతుందన్నారు. వైద్య ఖర్చులు భారమైన పేద వారికి కొండంత భరోసాగా మానవతా దృక్పథంతో సీఎం చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు, గోరంట్ల కార్యాల యంలో నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 14మంది లబ్ధిదారులకు రూ.12,65,349 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంద న్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చుచేసి అప్పులు పెనుభారమై ఇబ్బందులు పడుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా ఉదారంగా అందిస్తున్న సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపేదవాడికి వైద్యన్ని మరింత చేరువ చేసేందుకు ప్రతి కుటుంబానికి రూ.25లక్షల వరకు ఇన్సూరెన్స్ పథకం ఈ ఏడాది నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, దండమూడి తేజా, కురుకూరి కిషోర్, పాఠంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, పెండ్యాల రామకష్ణ, పండూరి అప్పారావు, గారపాటి నాగేశ్వరరావు, బొప్పన నానాజీ పాల్గొన్నారు..

మానసిక ఆరోగ్యానికి

క్రీడలు దోహదం

● జీబీఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ రత్నారెడ్డి

అనపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని ప్రతి విద్యార్థి క్రీడలపట్ల ఆశక్తిని పెంపొందించుకోవాలని జీబీఆర్ విద్యా సంస్థల పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి అన్నారు. గురువారం జీబీఆర్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే ఇంట్రాస్పోర్ట్స్ మీట్‌ను ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గేమ్స్ డైరెక్టర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ వంటి క్రీడలు నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు జరిగిన రన్నింగ్ రేస్‌లో విజేతలకు రత్నారెడ్డి చేతుల మీదుగా మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీన్ హరిప్రసాద్, హెచ్‌ఎం భువనేశ్వరి, జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ జగన్నాధరెడ్డి, ఉమా వెంకటరెడ్డి, ఇన్‌చార్జిలు వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ ప్రశాంతిరెడ్డి, ఏవో ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ● గాడాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


సీతానగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, గాడాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాడాల గ్రామంలో రైతు సేవాకేంద్రంవద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమంకోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిరయించిన మద్దతు ధరకు గ్రేడ్1 రకం క్వింటా రూ.2389లు, కామన్‌రకం రూ.2369లకు విక్రయించి లాభం పొందాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సీతానగరం,(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరిలు కోరారు. గురువారం మండలంలోని చినకొండేపూడి, రఘుదేవపురం రైతు సేవాకేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మకాలు జరుపుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలద్వారా అమ్మకాలు జరిపి తే మద్దతు ధర పొందవచ్చునన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాలలో కాటాను, తేమను కొలిచే యంత్రాలను పరిశీలించారు. రైతులకు బస్తాల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో గైరీదేవి, ఎంపీడీవో భారతి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కాండ్రు శేఖర్, మట్ట వెంకటేశ్వరరావు, రాపాక వెంకట లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు

ఎస్‌కేఆర్ ఉమెన్స్ కళాశాల ప్రాంగణంలోని హాస్టల్ హితకారిణిదే

● హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ ప్రదీప్ సుకుమార్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న లేడీస్ హాస్టల్ హితకారిణి సమాజం పరిధిలోనే ఉందని ఆ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్‌సుకుమార్ అన్నారు. ఎస్‌కేఆర్ ఉమెన్స్ కళాశాల ఎంబీఏ బ్లాక్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు తీసుకువచ్చిన జీవో వలన హితకారిణి సమాజం ఆధీనంలో ఉన్న ఏడు విద్యాసంస్థలలో ఎస్‌కేవీటీ ఇంగ్లీషు మీడియం స్కూల్, డిగ్రీకళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారని మిగిలిన ఐదు సంస్థలు హితకారిణి సమాజం ఆధీనంలోనే ఉన్నాయని ఇది క్లియర్‌గా జీవోలో ఉందన్నారు. ఎస్‌కేఆర్ ఉమెన్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న లేడీస్‌హాస్టల్ హితకారిణి ఆధీనంలో ఉండగా దానికి విరుద్ధంగా ప్రస్తుత ప్రిన్సిపాల్ రాఘవకుమారి ఆ ఆహాస్టల్‌కు ప్రత్యేకంగా విద్యార్థుల నుంచి డబ్బులు వసూల్ చేశారని ఆరోపించారు. ఆఫీజులను వ్యక్తిగత అకౌంట్‌లోకి మళ్లించారని ఆరోపించారు. గతంలో తాము ప్రతిపాదన చేసిన హాస్టల్ మరమ్మతులకు రూ.40 లక్షలను రూ.60లక్షలకు పెంచారని, కోటి పది లక్షలు సీఎస్‌ఆర్ నిధులు ఏవిధంగా వినియోగించారనే దానికి సమాధానం లేదన్నారు. నిబంధన లకు విరుద్ధంగా వసతి గృహంలోకి మాంసహారం అనుమతించారని చెప్పారు. అన్నింటి పైన విచారణ జరిపిస్తామని హితకారిణి సమాజం ఆస్తులను, విద్యాసంస్థలను తమ పాలక మండలి పరిరక్షిస్తుందన్నారు. ఈవో జనగం వినోద్ కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌కు హాస్టల్ నిర్వహణపై నోటీసులు ఇచ్చా మని దానికి ఆమె స్పందించలేదన్నారు. దీంతో ఆర్‌జేడీకి విషయాన్ని తెలియజేశామన్నారు. ఈ సమావేశంలో హితకారిణి సమాజం పాలక మండలి సభ్యులు ఆదిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయిబాగ్యలక్ష్మి, కుచ్చర్లపాటి లలితారాణి, గుణ్ణం శ్యామ్ సుందర్, అనంత సత్యనాగవల్లి, కొడమల శ్రీనివాసరావు, ఎం.విజయకృష్ణ, శేషు కుమారి, వెంకట నాగలక్ష్మిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ సుకుమార్

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

దివాన్‌చెరువు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక, అధ్యాపకేతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంను గురువారం సందర్శించి తనను ఎన్నుకున్న అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యాపరిశోధనలు, విద్యాలయాల అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ గోపిమూర్తిని రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.


ఎమ్మెల్సీ గోపిమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న నన్నయ అధికారులు

ఎస్‌ఏ-1 పరీక్షలను పరిశీలించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం

బిక్కవోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరికరేవుల యూ పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌ఏ-1 పరీక్షలను గురువారం ఊలపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం కన్నారావు పరిశీలించారు. ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు.

నేడు అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని జరపాలి

● ఎస్‌ఏ-1 పరీక్ష వాయిదా

బిక్కవోలు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఎస్‌సీఈఆర్‌టీ వారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం నవంబరు 14న పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలు జరపాలని ఆదేశాలు అందినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ గురువారం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నిర్వహించే ఎస్‌ఏ-1 పరీక్షను వాయిదావేసి, ఆ పరీక్షను 1నుంచి ఐదు తరగతుల వారికి ఈనెల 17న, 6నుంచి 10 తరగతుల వారికి ఈనెల 20న నిర్వహించాలని సూచించారు.

ఘనంగా గాయత్రి హోమం

రాజానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రాజానగరంలోని బాబా ఆలయంవద్ద గురువారం గాయత్రి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బాబామందిర ప్రాంగణంలో 11 హోమ గుండాలను ఏర్పాటుచేసి భక్తులచే హోమ క్రతువును చేపట్టారు. అమలాపురానికి చెందిన పరమపూజ్య రామానంద స్వామీ జీ శిష్యగణం ఈ హోమ క్రతువును భక్తులచే వైభవంగా జరిపించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన అఖండ అన్న సమారాధనలో గ్రామస్థులతో పాటుగా పలువురు ప్రముఖులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

సామూహిక లక్ష పత్రిపూజ

సీతానగరం,నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగవరం పంచాయతీ పరిధిలోని దుర్గమ్మకాలనీవద్ద ఉన్న శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంవద్ద కార్తీక మాసం సం దర్భంగా ఆలయ అర్చకుడు యనమండ్ర గంగాధర్ ఆధ్వ ్యంలో ఆలయకమిటీ పర్యవేక్షణలో సామూహిక లక్షపత్రిపూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు గంగాధర్ పండితులను సత్కరించారు.

అన్న సమారాధనకు విరాళం అందజేత

కోరుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా గురువారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు తీర్థ ప్రసాదాలు వడ్డించారు. అన్న సమారాధనకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తానని అన్నారు.కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఔషధాల తయారీలో విప్లవాత్మక మార్పులు

దివాన్‌చెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నానో పార్టికల్స్ ద్వారా ఔషధాలను నిర్ధిష్ట కణాలకు చేరవేయడం, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు వస్తాయని దివాన్‌చెరువులోని వీజే ఫార్మశీకళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డిఅన్నారు. స్థానిక వీజే కళాశాల, విజన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో పార్మశీరంగంలో ఉద్యోగపాత్రలు ఉపాధి అవకాశాలు అనే అంశంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ వ్యాధులను గుర్తించడం గురించి తెలిపారు. రోబోటిక్ సర్జరీలు, ఔషధాల తయారీలో డేటావిశ్లేషణ వంటి విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో విజన్‌టెక్ వ్యవస్థాపకుడు, సీఈవో వినయ్‌తేజ, , బయోస్టాటిస్టికల్ ప్రోగ్రామర్ మరియు బిజినెస్ డెవలప్‌మెంట్ అంజన్‌కుమార్, వీజేఉ కళాశాల డీన్ కె.శ్రీనివాస్ పాల్గొని పలు విషయాలను వివరించారు.



ఆలయ నిర్మాణాలకు ప్రతిపాదనలు స్వీకరణ



నిడదవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఈ మేరకు గురువారం నిడదవోలులో ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ శ్రీవాణి భజన మండపం పథకం కింద ఏపీలో 500 దేవాలయాల అభివృద్ధికి ముందుకొచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి ఐదు సెంట్లు స్థలం ఉంటే రూ.10 లక్షలు, 8 సెంట్లు స్థలం ఉంటే రూ.15 లక్షలు, 10 సెంట్లు కన్నా ఎక్కువ ఉంటేరూ. 20 లక్షలు మంజూరవుతాయన్నారు.ప్రతిపాదనలు పంపేవారు ఖాళీ స్థలం ఫొటోలు, ఆలయ ప్లాన్, జీపీఎస్ ఫొటోలను జత చేయాలన్నారు.

ఆకట్టుకున్నారు.. అలరించారు..



రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి వారసత్వాన్ని యువతకు పరిచేయడమే గిరిజన స్వాభిమాన్ ఉత్స వాల ప్రధాన ఉద్దేశమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎస్.జ్యోతి అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయం తిని పురస్కరించుకుని బొమ్మూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం సం ప్రదాయ గిరిజన వస్త్రధారణ ఫ్యాషన్ షో జరిగింది.పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు.శనివారం ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని బహుమతులు అందజేస్తారు.

జైకొడతాం.. గణేశా!



బిక్కవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయాన్ని రూ.16 కోట్లతో అభివృద్ధికి దేవదాయశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఆలయం బాగా పురాతనమైనది కావడం, భక్తుల రద్దీ పెరగడంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేవదాయశాఖ ఆలయాన్ని పరిశీలించి ఆలయ అభివృద్ధికి స్థలం సేకరిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ఈ మేరకు గ్రామస్తులు దాతల సహకారంతో ఇప్పటికే రూ.కోటి విలువ చేసే భూములను దేవదాయశాఖకు అప్పగించారు. ఇంకో రూ.1.5 కోట్ల భూములను సేకరించే పనిలో ఉన్నారు. దీంతో దేవదాయశాఖ డీఈఈ ఉదయ్‌కుమార్ సేకరించిన స్థలాన్ని, ఆలయాన్ని పరిశీలించిన అనంతరం రూ. 16 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. నిధులు విడుదలకు కృషి చేస్తామన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని వినతి

కొవ్వూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని లేఅవుట్ - 3లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5 ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. రాజమహేంద్రవరంలో గురువారం జిల్లా కలెక్టర్ కీర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొవ్వూరులోని నందమూరు జంక్షన్ వద్ద పశివేదల రోడ్‌లో ఇంటి స్థలాలు అందించడానికి 11.68 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో సేకరించారు. అయితే చాలా మంది లబ్ధిదారులు ఆ స్థలాలు పొందడానికి ఇష్టపడడం లేదు. ఖాళీగా ఉన్న లేఅవుట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 5 ఎకరాలు, బీసీ సంక్షేమ సంస్థ నిర్మాణానికి 5 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందజేశారు. వాడపల్లి బంగారంపేట వద్ద వాటర్‌గ్రిడ్ కోసం రైతుల నుంచి భూసేకరణచేస్తున్న పొలాలకు గిట్టుబాటు ధర అందించాలని రాత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 14 రకాల పరీక్షలు

సీతానగరం,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని నేషనల్ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ సభ్యులు డా.నాగరాజు, డా. సుదర్శన్ తెలిపారు. సింగవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలను గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల టెస్ట్‌లు చేస్తారన్నారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకె చైతన్య, సర్పంచ్ సంగన పోశియ్య, కె . నవీన, ఎస్.సుధ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో శనివారం (15న) జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత ఉండాలన్నారు. 19-40 ఏళ్ల మధ్య వారు మేళాకు రావొచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్య వెబ్ పోర్టల్, ఎంప్లాయిమెంట్ పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

13న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లు న్యాయాన్ని ప్రజలకు సులభంగా త్వరితగతిన తక్కువ వ్యయంతో అందించే వేదికలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు.చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.సంస్థల్లో రాజీకి యోగ్యమైన కేసులను గుర్తించి, ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు.



ఇసుకాసురులు!

గోదాట్లో ఇసుక మాఫియా

- రెచ్చిపోతోన్న అక్రమార్కులు
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- నిబంధనలు మీరి తవ్వకాలు
- అన్ని ర్యాంపుల్లోనూ డ్రెడ్జింగ్
- అయినా పట్టని అధికారులు
- అటకెక్కిన ఉచిత ఇసుక

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నారు. పేరుకే బోట్స్‌మన్ సొసైటీలు. గోదారి నిండా డ్రెడ్జింగ్ బోట్లే. ఇష్టానుసారం ఇసుకను తవ్వేస్తున్నారు. అనేక మంది దోపిడీకి పాల్పడుతున్నారు. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ రూ.లక్షలు దోచుకుంటున్నారు.అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కంటే ప్రజలకు కాస్త తక్కువ ధరకు ఇసుక లభ్యం కావడం గమనార్హం. కానీ ఇసుక దోపిడీ లేకపోతే వినియోగదారుడికి మరింత చౌకగా ఇసుక లభ్యమయ్యేది.

డ్రెడ్జింగ్ చేసినా పట్టదెందుకో..

పడవలపై ఇసుక తీస్తే కాస్త ఎక్కువ ధర ఉంటుంది. కానీ డ్రెడ్జింగ్ వల్ల చౌకగా ఇసుక లభ్యమవ్వాలి.కానీ డ్రెడ్జింగ్ చేసినందుకు యూనిట్‌కు రూ.200.. అది డ్రెడ్జింగ్ బోట్ నుంచి అన్‌లోడ్ చేసి గట్టు మీద వేసినందుకు రూ.100.. మిషన్‌తో దానిని లారీలో ఎగుమతి చేసినందుకు రూ.200..గట్టుమీద కూర్చుని ఈ వ్యవహారం అంతా నడిపించినందుకు బోట్స్‌మన్ రూపంలో ఉన్న వ్యాపారికి రూ.500.. ఇక నేతలకు టన్నుకు రూ.50 లేదా 3 యూనిట్ల లారీకి రూ.1000, 6 యూనిట్ల లారీకి రూ.2 వేలు ఇవాల్సిందే. అవి కాకుండా పెద్దల పేర్లు చెప్పుకు తిరిగే నేతలకు ఒక్కొక్కరికి రూ.100 వంద వంతున చెల్లించుకోవాలి. పోలీసులు, ఇతర అధికారులకు రూ.100 వంతున ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి బోట్స్‌మన్ సొసైటీల ద్వారా మాన్యువల్‌గా ఇసుక తీయడానికే డీసిల్టేషన్ పేరిట ర్యాంపులను ఇచ్చారు. కానీ అందరూ డ్రెడ్జింగ్ పడవులు వాడేస్తున్నారు. గతంలో మత్స్యకారులు, బోట్స్‌మన్ సొసైటీలు వాడిన ఇంజన్ పడవలు ఒడ్డున పడిఉన్నాయి. ప్రస్తుతం డ్రెడ్జింగ్ బోట్లు రాజ్యమేలుతున్నాయి.ర్యాంపులకు వెళితే కళ్లెదుట కనబడినా అధికారులు కళ్లు మూసుకుంటున్నారు.ఏదో అడపాదడపా తనిఖీలతో సరిపెడుతున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ ఇసు కాసురులకే సహకరిస్తున్నారు.

రాత్రయితే తవ్వేయ్..

వాస్తవానికి పగటి పూటే ఇసుక తీయాలి. కానీ సాయంత్రం ఆరు గంటలకు ఆరంభించి అర్థరాత్రి వరకూ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. 40 టన్నుల లారీల్లో 60 టన్నుల వరకూ ఇసుకను వేసి రాత్రికి రాత్రే తరలించేస్తున్నారు. ప్రధానంగా రాజమహేంద్రవరం నుంచి బొమ్మూరు మీదుగా ప్రతి రోజూ వందలాది లారీల ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే వారే కాన రావడంలేదు. దానికి తెల్లారి ఆ రోడ్లపై పడి ఉండే ఇసుకే సాక్ష్యం. మామూళ్లకు అలవాటు పడిన రాత్రి పోలీసులు బాలాజీపేట జంక్షన్‌లో కాపు కాసి లారీకి ఇంత తీసుకుని వదిలేస్తున్నారు. ఇది చాలా కాలంగా జరుగుతున్న తంతే..ఆ సెంటర్‌లో ఏ సీసీ కెమెరాలో చూసినా ఈ భాగోతం బయటపడుతోంది.రాత్రుళ్లు ఎన్ని లారీలు వెళ్లిపోతున్నాయో తెలుస్తోంది. తరలిపోయిన ఇసుకే కాకుండా తెల్లారే సరికి గోదావరి ఒడ్డున పెద్దపెద్ద ఇసుక గుట్టలు ఉంటాయి. దానిని రాత్రీ పగలూ అమ్ముతూనే ఉంటారు.అంత ఇసుక ఎలా వచ్చిందని ఎవరూ అడిగే ధైర్యం చేయరు. ఎందుకంటే అందరికీ తెలిసిన రహస్యమే..అదే డ్రెడ్జింగ్.. బహిరంగంగా పెద్దపెద్ద డ్రెడ్జింగ్ పడవలే గోదా వరికి చేరినా ప్రశ్నించేవారే కరువయ్యారు.

బ్రిడ్జిల చెంత వదలరు..

ఫోర్త్ బ్రిడ్జి సమీపం నుంచి కాతేరు వైపు డ్రెడ్జింగ్ బోట్లు బహిరంగంగానే కనపడుతున్నాయి. ఆయా ర్యాంపుల నిండా డ్రెడ్జింగ్ బోట్లే. ఇసుక మాఫియాకు కనీసం భయం లేదు. రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో ఇసుక దోపిడీకి అంతులేకుండా పోయింది.నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతున్నా అధికారులెవరూ పట్టిం చుకోకపోవడం గమనార్హం.కనీసం కలెక్టర్ ఆ దిశగా చేపట్టిన చర్యల్లేవ్..ఇసుక అక్రమాలు అరికట్టడానికి నియమించిన టాస్క్‌ఫోర్స్‌కు డ్రెడ్జింగ్ కనిపించకపోవడం గమనార్హం. గోదావరిలో యంత్రాలతో గుల్లబొడు స్తున్నా ఇరిగేషన్ అధికారులు అసలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ వర్షాకాలం వచ్చే వరకూ ఈ ఇసుక దోపిడీకి అడ్డుకట్ట లేనట్టే. అధికారులు పట్టించుకుని ఈ అక్రమాలు నియంత్రించగలిగితే ఉచిత ఇసుక విధానం మరింత ఫలి తాలనిస్తుంది. వినియోగదారుడికి తక్కువకు అందుతుంది. అధికారులు ఇసుక దోపిడీ అరికట్టాలి.

మీ విజన్ మారాలి!

విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సులో సీఎం చంద్రబాబు



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- అభివృద్ధికి ఆస్కారం ఉంది
- కోనసీమలో తలసరి ఆదాయం పెంచండి
- కాకినాడ-అనకాపల్లి మధ్య ఎయిర్‌పోర్టు
- కడియం నర్సరీలు అభివృద్ధి చేయాలి

కాకినాడ,కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లో అభివృద్ధికి చాలా ఆస్కారం ఉంది.కానీ ఆ స్థాయిలో ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు ఈ జిల్లాలను విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో చేర్చిన నేపథ్యంలో విజన్‌ప్లాన్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. జిల్లా కలెక్టర్లకు ఈ రోజు నుంచే రన్నింగ్‌రేస్ మొదలైనట్టు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సు గురువారం విశాఖలో జరిగింది.రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల కలెక్టర్లను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. సదస్సులో కాకి నాడ, కోనసీమ కలెక్టర్లు షాన్‌మోహన్, మహేష్, తూర్పు గోదావరి నుంచి మరికొందరు అధికారులు హాజరయ్యారు. ఎకనమిక్ రీజియన్ పరిధిలోని జిల్లాల్లో ప్రస్తుత స్థితిగ తులు, భవిష్యత్తు అభివృద్ధి ఏవిధంగా చేయాలనే దానిపై ప్రత్యేక బుక్‌లెట్‌ను సీఎం ఆవిష్కరించారు.రీజియన్ పరిధి లోని జిల్లాల్లో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడానికి పెద్ద ఎత్తున కలెక్టర్లు కృషిచేయాలని ఆదేశించారు.పర్యా టక ఈవెంట్లు,ఎగ్జిబిషన్లు తరచూ జరగాలని సూచించారు. విశాఖ నుంచి చెన్నై వరకు ప్రస్తుతం ఉన్న రెండు రైల్వే లైన్లు భవిష్యత్తులో నాలుగుకు పెరగబోతున్నాయని తద్వా రా రైళ్ల వేగం పెరుగుతుందన్నారు. సముద్ర తీరం, హైవేలు విస్తృతంగా ఉన్నాయని, ఎయిర్ కనెక్టివిటీని పెంచడం కోసం కాకినాడ-అనకాపల్లి మధ్య చిన్న ఎయిర్ పోర్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లాలో అద్భుతమైన కడియం నర్సరీలు ఉన్నాయని,వీటిని ఇంకా లాజికల్‌గా మరింతగా అభి వృద్ధి చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నా సరే వాటిని మరింతగా ప్రమోట్ చేయడం లేదని దీనిపైనా దృష్టిసారించాలని సూ చించారు.సముద్రం,నది ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో రివర్‌క్రూయిజ్‌కు చాలా భవిష్యత్తు ఉందన్నారు. అన్నవరం నుంచి శ్రీకాకుళం వరకు టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు.విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో జిల్లాల అభివృద్ధికి తరచూ సమీక్షలు జరగాలని, ఈ రీజియన్‌కు చైర్మన్‌గా తానే వ్యవహరిస్తానని చంద్రబాబు అన్నారు.

తూర్పుగోదావరి జిల్లా తలసరి ఆదాయం రూ.2.59 లక్షలు

తలసరి ఆదాయంలో కోనసీమ జిల్లా చాలా వెనుకబడి ఉందని సీఎం గుర్తు చేశారు.ఆ జిల్లా కలెక్టర్ ఇక్కడే ఉన్నారు..ప్రజల తలసరి ఆదాయం పెంచకపోతే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. దీనిపై దృష్టిసారించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని ఆదేశించారు. రీజియన్‌లోని తొమ్మిది జిల్లాల్లో ప్రజల తలసరి ఆదాయాలను ప్రస్తా వించారు. కాకినాడ జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2.42 లక్షలు, కోనసీమ రూ.2.06 లక్షలు, తూర్పుగోదావరి జిల్లా 2.59 లక్షలుగా ఉందన్నారు. ఇకపై రీజియన్ పరిధిలో జిల్లాల్లో అభివృద్ధిని పరుగులు తీయించడానికి విజన్ ప్లాన్ అమ లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలు ఏ అంశాల్లో బలంగా ఉన్నాయి.. ఎక్కడ వెనుకబడి ఉన్నాయో గుర్తించి అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.కాకినాడలో రెండు పోర్టులను విదేశీ ఎగుమతులు దిగుమతులకు ఎక్కువగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సాగుపై రీఓరియంటేషన్ జరగాలన్నారు.



పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి , ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు

పుష్కర ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027ను సమర్థవంతంగా నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పుష్కరాల ప్రాథమిక సమీక్ష సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో వారి సూచనలు, సలహాలను అధికారులు తయారు చేసే ప్రతిపాదనలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గత పుష్కరాల సమయంలో భారీ జనసమ్మర్థం, రవాణా సౌకర్యాలు, భద్రత, శానిటేషన్, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాల వారీగా చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, ఆర్టీసీ తదితర శాఖలు పీపీటీ ద్వారా సమగ్రంగా వివరించాయన్నారు. రానున్న సమావేశంలో ఇరిగేషన్, దేవాదయ, రైల్వే, రవాణా, విద్యుత్, మునిసిపల్ శాఖలు 2003, 2015 పుష్కరాల్లోని అనుభవాలతో పాటు భవిష్యత్ ప్రణాళికలను సమర్పించాలన్నారు. రానున్న పుష్కరాల నిర్వహణలో స్మార్ట్ మానిటరింగ్, ఐసీసీసీ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, ఏఐ టెక్నాలజీ, డిజిటల్ ఇన్వెంటరీ సిస్టం వంటి ఆధునిక పద్ధతులు కీలకమన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం రెండు చోట్లా పుష్కర స్నానాలు ఆచరించే క్రమంలో భక్తుల సంఖ్యను ముందస్తు అంచనా వేయాలన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవం, సాంప్రదాయ విధానాలు, గోదావరి పుష్కరాలకు సంబంధించిన విశిష్ట ఆచారాలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలను సమగ్రంగా ప్రతిబింబించే విధంగా దేవాదయ, సాంస్కృతిక శాఖలు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. గోదావరి ఆధ్యాత్మికలను మరింత వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల పర్యవేక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో అమలు చేసిన స్మార్ట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శానిటేషన్, డిజిటల్ కమ్యూనికేషన్, ఐసీసీసీ ఆధారిత పర్యవేక్షణను ఏపీఎంజీ కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ప్రశాంత్ వివరించారు. గోదావరి పుష్కరాలకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ లేఅవుట్, మోడల్ ప్లాన్‌ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ మేఘాస్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ, ఆర్డీవోలు పాల్గొన్నారు.



భూములపై చర్చిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

కోరుకొండలో భూముల రికార్డుల పరిశీలన

కోరుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో 1,202.34 ఎకరాల భూములు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పేరున ఉన్నట్టు గుర్తించామని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ ఎం.సత్యనారాయణ, ఆర్డీవో కృష్ణనాయక్ సంయుక్తంగా ఎండోమెంట్ భూములపై గురువారం సమీక్షించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి పేరున ఉన్న జిరాయితీ భూముల రికార్డులను పరిశీలించారు. కోరుకొండ గ్రామంలో మొత్తం విస్తీర్ణం 1,616.45 ఎకరాలు కాగా అందులో పోరం బోకు భూములు 414.11 ఎకరాలు మిగిలిన 1,202.34 ఎకరాలు ఎండోమెంట్‌కి సంబంధించినట్టుగా రిజిస్టర్‌లో నమోదైనట్టు తెలిపారు. వీటిలో జిరాయితీగా ఉన్న 259.20. ఎకరాలకు సంబంధించిన సర్వే నెంబర్లను పరిశీలించి సవరిస్తామన్నారు. కోరుకొండలో సర్వీస్ ఇనాం భూములుగా ఉన్న 130.63 ఎకరాలను రికార్డుల్లో సరిచేసి సర్వీస్ ఇనాం భూములుగా మారేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నిడదవోలు ఎంపీడీవోగా సత్యనారాయణ



నిడదవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా టీవీ సత్యనారాయణ శుక్రవారం సమిశ్రగూడెం గ్రామం లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు పెంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఈయన నిడదవోలు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.







సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

గోపాలపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలకు వాదాలకుంట విద్యార్థిని ఆశ్రిత ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ గురువారం తెలిపారు. ఈనెల 2, 3 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన సపక్‌తక్ర అండర్-14 విభాగంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తరపున వాదాలకుంట హైస్కూలు విద్యార్థులు ఆశ్రిత, రితిక, దక్షిత, అఖిల్ పాల్గొన్నారని తెలిపారు. అండర్-14 బాలబాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఆశ్రిత సిల్వర్ మెడల్ సాధించినట్టు చెప్పారు. డిసెంబరు లో జరిగే జాతీయస్థాయి సపక్‌తక్ర పోటీలలో ఆశ్రిత పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జయ జయ.. సత్యదేవా

- పసుపుమయమైన అన్నవరం
- 3వేలమంది సత్యదీక్షల విరమణ
- ఉచిత సామూహిక వ్రతాలు

అన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి గురువారం సత్యదీక్షాపరులతో పసుపుమయంగా మారింది. 27 రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో దీక్షలు చేపట్టిన సత్యదీక్షాపరులు దీక్షలను విరమించారు. శిరసున ఇరుముడులు పెట్టుకుని పలువురు మెట్టమార్గం, మరికొందరు వివిధ వాహనాల్లో స్వామి సన్నిధికి చేరుకున్నారు. వారందరికీ వార్షిక కల్యాణ వేదికపై ఉన్న అర్చకస్వాములు ఇరుముడులను స్వీకరించారు. వీటిని స్వామిపాదాల చెంత ఉంచారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఏర్పాటు చేశారు. సుమారు 3వేలమంది సత్యదీక్షలను విరమించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు





ఇరుముడులు సమర్పిస్తున్న సత్యదీక్షాపరులు

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవరులకు జన్మనక్షత్రపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. ఈ సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలతో మంత్రపూర్వకంగా అభిషేకం చేపట్టారు. అనంతరం నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి సుగంధభరితపుష్పాలతో అలంకరించి సర్వదర్శనాలకు భక్తులను అనుమతించారు. యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించగా ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం గోపన్నపాలెంలో ఈ నెల 18న జరగనున్న కార్తీక వన సమారాధన బ్రోచర్‌ను ద్వారకాతిరుమలలో నేతలు గురువారం ఆవిష్కరించారు. యాదవ సంఘ జిల్లా కార్యదర్శి కూరాకుల బుజ్జి, ఇతర నేతలతో కలిసి యాదవ కల్యాణ మండపం ఆవరణలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గోపన్నపాలెంలోని పీఈటీ కళాశాల గ్రౌండ్స్ ఆవరణలో జరుగుతుందని మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని సంఘ నేతలు, సంఘ సభ్యులు, యాదవ సోదరులు పాల్గొనాలని కోరారు. ములకాల రాం బాబు, గుర్రముచ్చ వెంకన్న, పాకనాటి సుబ్బారావు, కంచు సుబ్బారావు పాల్గొన్నారు.

జానకి రామయ్య సేవలు ప్రశంసనీయం

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాల ఉత్పత్తిదారులకు మండవ జానకీ రామయ్య అందించిన సేవలు ఎన లేనివని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని రాళ్లకుంట లో కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తి దారుల అసోసియేషన్ పాలకేంద్రంలో గురువారం జరిగిన మండవ జానకి రామయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. మండవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ ఛైర్మన్‌గా పాడి రైతులకు ఎనలేని సేవలందించిన మండవ ఈ నెల 6న మృతి చెందడం బాధాకరమన్నారు. జి.నాగేశ్వరరావు, ఘంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీకి జ్ఞాపిక అందజేస్తున్న నన్నయ అధికారులు

దివాన్‌చెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక, అధ్యాపకేతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంను గురువారం సందర్శించి తనను ఎన్నుకున్న అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీని కలిశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యాపరిశోధనలు, విద్యాలయాల అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తిని రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు సత్కరించి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

సాంకేతిక పురోగతిపై పట్టుసాధించాలి

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతికత పురోగతిపై యువత పట్టు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో పెర్కిన్ ఎల్మెర్ సహకారంతో ఆధునిక విశ్లేషణాత్మక సాంకేతికతలో ఇటీవల పురోగతి అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ యు.ఎస్.ఏ.లోని పెర్కిన్‌ఎల్మెర్ విశ్లేషణాత్మక పరికరాలు, రోగనిర్ధారణ, జీవశాస్త్రాలు, పర్యావరణ పరిరక్షణలో ఆవిష్కరణలకు అంకితమైన శాస్త్రీయ సాంకేతిక సంస్థ అని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ సంస్థ నన్నయ విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధన విశ్లేషణాత్మక ఆవిష్కరణల పురోగతికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈవిద్యా-పరిశ్రమ సహకారం ద్వారా విశ్వవిద్యాలయం శాస్త్రీయ శిక్షణను బలోపేతం చేయడానికి అంతర్ విభాగ పరిశోధకులను ప్రోత్సహించడానికి, ప్రపంచ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పెర్కిన్‌ఎల్మెర్ ప్రాంతీయ సేల్స్ మేనేజర్ అచ్యుతరావు మాట్లాడుతూ తమ సంస్థ ఎనిమిది దశాబ్ధాలకు పైగా శాస్త్రీయ ఆవిష్కరణ, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉందన్నారు. కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి నన్నయలో గణితంలో బ్రిడ్జి కోర్స్ ప్రారంభం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యంలో సంభావ్యత , గణాంకాలపై శుక్రవారం నుంచి బ్రిడ్జికోర్స్ ప్రారంభిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం పలు వివరాలను తెలిపారు. విశ్వవిద్యాలయంలోని రెండవ సంవత్సరం విద్యార్థులందరికీ ఈ బ్రిడ్జికోర్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. 25వ తేదీ వరకూ సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకూ తరగతులు జరుగుతాయని చెప్పారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖాగ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయ అధికారి ఎన్.సి.హెచ్.రామకృష్ణ తెలిపారు. చివరి రోజున బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. విద్యార్థులు రూ.15 చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఇస్తామన్నారు.







టీడీపీ పటిష్ఠతకు కార్యకర్తలు పాటుపడాలి

● ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. గురువారం వేలివెన్ను గ్రామంలో నియోజకవర్గస్థాయి వివిధ గ్రామాల మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, వార్డు, బూత్ కమిటీల ప్రమాణస్వీకారం ఉత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు



సమావేశంలో మాట్లాడుతున్న శేషారావు

మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు ఉన్న అన్ని రకాల కమిటీల నాయకులు పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేయాలని చెప్పారు. ప్రతి కార్యకర్తకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీ చేసే ప్రతి కార్యక్రమాలు ప్రజల వద్దకు వెళ్లాలని, దీనికి కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. తాను ప్రతి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, పార్టీ సంక్షేమానికి, అభివృద్ధికి మీఅందరి సహకారంతో పని చేస్తున్నట్లు ఆయన వివరించారు. పార్టీ పదవులు స్వీకరించిన వారు కష్టపడి పనిచేసి పార్టీకి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోర్కొన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నుముఖ అని, పార్టీ కోసం సైనికుడిలా పనిచేయాలని శేషారావు కోరారు. తొలుత కమిటీల ప్రమాణ స్వీకారాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దాసరి వీర వెంకటసత్యనారాయణ, నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు వెలగన సూర్యారావు, ఉండ్రాజవరం అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల అధ్యక్షుడు అతికాల రామకృష్ణ, ఏఏమ్ సీ ఛైర్మన్ గాలింకి జిన్నాబాబు, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ పువ్వుల రతీదేవికి సత్కారం

నిడదవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధిగా పూర్వపు విద్యార్థిని రతీదేవి సమాజ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో అభినంద నీయమని ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ రుద్ర అన్నారు. గురువారం నిడద వోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ మహిళా డిగ్రీ కళా శాలలో పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పువ్వుల రతీదేవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రుద్ర మాట్లాడుతూ రతీదేవిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపక బృందం, పూర్వపువిద్యార్థులు పాల్గొన్నారు.


ఏఎంసీ వైస్‌చైర్మన్ పువ్వుల రతీదేవిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థినిలు

సామూహిక లక్ష పత్రిపూజ

సీతానగరం, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) సీతానగరం మండలం, సింగవరం పంచాయతీ పరిధిలోని దుర్గమ్మకాలనీ వద్ద ఉన్న శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా ఆలయ అర్చకులు యనమండ్ర గంగాధర్ ఆధ్వర్యంలో ఆలయకమిటీ పర్యవేక్షణలో సామూహిక లక్షపత్రిపూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు గంగాధర్ పండితులను సత్కరించారు.

కొవ్వూరు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా: ఎమ్మెల్సీ గోపిమూర్తి

దివాన్‌చెరువు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక, అధ్యాపకేతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంను గురువారం సందర్శించి తనను ఎన్నుకున్న అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

మినుములో లింగాకర్షక ఎరల వాడకంపై అవగాహన



మినుములో లింగాకర్షక ఎరల వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కొవ్వూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మినుముపంటలో తెల్లదోమ, పొగాకు లద్దె పురుగు నివారణకు పసుపుజిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు పొలాల్లో అమర్చినట్లయితే సస్యరక్షణ ఖర్చు తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. కొవ్వూరు మండలం వేమూలూరులో గురువారం రైతుల కమతాలలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.చల్లా వెంకట నరసింహారావు, డా.మానుకొండ శ్రీనివాస్‌ల శిక్షణలో మండల వ్యవసాయాధికారి గంగాధర్ ఆధ్వర్యంలో మినుము పంటలలో తెల్లదోమ, పొగాకు లద్దెపురుగు నివారణకు పసుపు జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు పొలాల్లో అమర్చారు. వ్యవసాయ కళాశాల నైరాలో బీఎస్సీ అగ్రికల్చరల్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎస్.రామలక్ష్మి, పీఆర్‌సీ జ్యాయిసీ, కె.సౌజన్య, షేక్‌జాన్ బీ మాట్లాడుతూ మి నుము పంటలలో లింగాకర్షక ఎరల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. లింగాకర్షక బుట్టలు అమర్చడం వలన పురుగులు ఆకర్షితమై, పంటలపై పురుగుల సాంద్రత తగ్గి, సస్యరక్షణకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందన



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి టెన్నికాయిట్, రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం విద్యార్థులను కళాశాలలో కరస్పాండెంట్ డి.సువర్ణరాజు అభినందించారు. జూనియర్ కళాశాల అండర్-18లో రాపాక సంస్కృతి, బి.ఆనంద్‌కుమార్ ప్రకాశంజిల్లా చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగే టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్ 200 మీటర్లలో పా ల్గొని రంజిత్ కుమా ర్ జాతీయస్థాయికి ఎంపికై హర్యానాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ విక్రమ్ తెలిపారు. కరస్పాండెంట్ సువర్ణరాజు, ఏవో ఆనంద్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ బీడీఎన్‌కుమార్, టీచర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు బాలల దినోత్సవాన్ని నిర్వహించాలి

బిక్కవోలు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఎస్‌సీఈఆర్‌టీ వారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం నవంబరు 14న పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలు జరపాలని ఆదేశాలు అందినట్లు ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ గురువారం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నిర్వహించే ఎస్ఏ-1 పరీక్షను వాయిదావేసి, ఆ పరీక్షను 1నుంచి ఐదు తరగతుల వారికి 17న, 6నుంచి టెన్త్‌వారికి ఈనెల 20న నిర్వహించాలని సూచించారు.